ప్రజాశక్తి
శుక్రవారం 11 ఆగస్టు 2023

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- అరకులోయ: మండలంలోని పద్మపురం పంచాయతీ ఎండపల్లివలసలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజన యువకుడు మృతి చెందాడు. అరకులోయ నుంచి ద్విచక్ర వాహనంపై ఎండపల్లి వలస వెళ్తున్న అరకులోయ మండలం పాంని రంగని గ్రామానికి చెందిన ఎల్‌బి అభిషేక్ (21) డివైడర్ను ఢీకొట్టాడు. దీంతో, తీవ్రంగా గాయాలు అయ్యాయి. స్థానికులు హటాహుటిన అరకులోయ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు అభిషేక్ తండ్రి ఎండపల్లి వలస టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ ప్రమాద సంఘటనపై అరకు లోయ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభిషేక్ మృతదేహం

ఇంధన సర్దుబాటు పేరుతో వడ్డన

-అదనపు వసూళ్లు బాదేస్తున్న ప్రభుత్వం- విద్యుత్ వినియోగదారులపై భారం- గగ్గోలు పెడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రజలపై విద్యుత్తు చార్జీల భారాలను ప్రభుత్వం కొనసాగిస్తోంది. బిల్లులను చూసి ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. కొందరికి బిల్లులు రెట్టింపు కావడంతో వారంతా బిత్తర పోతున్నారు. ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ రకాల చార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపి సామాన్య ప్రజానీకం నడ్డి విరుస్తున్న ప్రభుత్వాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వెల్లు వెత్తుతున్నాయి. నాడు వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యుత్ ఉద్యమంలో ముగ్గురు తమ ప్రాణాలను కోల్పోయారు. దీంతో, నాటి నుంచి 10 ఏళ్లపాటు విద్యుత్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వాలు పెద్దగా సాహసం చేయలేదు. ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా ఎనర్జీ చార్జీ, కస్టమర్ చార్జి, ట్రూ అఫ్ చార్జీ, ఇడి ఇలానే కరకాల చార్జీల పేరుతో ఎడాపెడా పెంచుకుంటూ పోతూ వినాశకర విద్యుత్ విధానాలు అమలు చేస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

ప్రస్తుతం ఇచ్చిన విద్యుత్ బిల్లులో మూడు రకాల అదనపు వడ్డనలు ఉన్నాయి. 2014-15 నుంచి 2018-19 వరకు ఇంధన సర్దుబాటు చార్జీలను 36 నెలలు వసూలు చేయాలని నిర్ణయించారు. అందుకు సంబంధించి 2022 ఆగస్టు నుంచి ప్రతినెల ట్రూ అఫ్ చార్జీల పేరుతో వసూలుకు తెర తీశారు. అదేవిధంగా 2021 మే వరకు ఉన్న ఇంధన సర్దుబాటు పేరుతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ (ఎఫ్ పిపిసి) చార్జీలు వసూలు చేస్తున్నారు. తాజాగా ఇంధన సర్దుబాటుకు సంబంధించి విద్యుత్ వినియోగించిన నెలకు మరుసటి నెలలో చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించారు. ఇలా అదనంగా మూడు సర్దుపోటులు వినియోగదారుడుపై పడుతున్నాయి. వీటితోపాటు ఇతర చార్జీలు కలిపి కనీసం యూనిట్‌కి అదనంగా ఒక రూపాయి వసూలు చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గడిచిన నాలుగేళ్లలో ఏడు సార్లు కరెంటు చార్జీలు పెంచారు. ఇంధన సర్దుబాటు పేరుతో ఎప్పటికప్పుడు ముక్కు పిండి వసూలు చేస్తూనే వినియోగ చార్జీ, ఫిక్స్ డ్ చార్జీ, ఎలక్ట్రిసిటీ డ్యూటీ ఇలా..అనేక రకాల పేర్లతో పెను భారం మోపుతోంది. నెలకు ఎన్ని యూనిట్ల విద్యుత్ వినియోగించినా ఇంధన సర్దుపోటుతో పాటు కస్టమర్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ ఇలా అదనంగా వేసే అన్నింటిని పేదవాడు కూడా చెల్లించాల్సిందే. సబ్సిడీ రూపంలో 200 యూనిట్లు వినియోగించుకునే వారిపైన ఈ వడ్డనలు పడ్డాయి. ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. అందుకు అవసరమైన నగదు కూడా వినియోగదారుల నుంచే వసూలు చేయనున్నారు. మీటర్ ఏర్పాటుకు అయ్యే మొత్తాన్ని కరెంటు బిల్లులో కలిపి రాబట్టుకొన్నారు.

బిజెపి విధానాలే అమలు

కేంద్రంలో బిజెపి విధానాలను ఇక్కడ వైసిపి అమలు చేయడం దారుణం. పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూ అఫ్ చార్జీలతో భారం మరింత పెరిగింది. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక 7 సార్లు విద్యుత్ చార్జీలు పెంచింది. ఇవే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలు రూ.100 నుంచి రూ.200 వరకు పెరిగాయి.

రామారావుదొర, ఆదివాసీ జెఎసి జిల్లా కన్వీనర్

భారాలు వేయడం దుర్మార్గం

ప్రజలపై భారాలు వేయబోమని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ గడిచిన 4 సంవత్సరాల పరిపాలనలో వేల కోట్లు భారాలు ప్రజలపై వేయడం దుర్మార్గం. విద్యుత్ సంస్కరణ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెలనెలా పెంచుతున్న కరెంటు చార్జీలు ఉపసంహరించుకోవాలి. రూ.3వేల కోట్లతో విద్యుత్ చార్జీల నియంత్రణకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తానని గతంలో వినియోగించిన విద్యుత్తుకు ఇప్పుడు అదనపు చార్జీలు వసూలు తగదు.

వి.ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

భారాలు రద్దు చేయాలి

ఇప్పటికే పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజానీకం అల్లాడుతున్నారు. పెంచిన కరెంటు చార్జీలు, ట్రూ అఫ్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల భారాలు రద్దు చేయాలి. లేకపోతే 2024 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ప్రజల్లో చైతన్యం రావాలి అప్పుడే ప్రభుత్వాలు తగిన బుద్ధి చెప్పగలం.

పొద్దు బాలదేవ్
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యుత్ సంస్కరణలను ప్రయత్నం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ను మార్కెట్ సరుకుగా మార్చే ప్రయత్నాల పట్ల ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ సంస్కరణలను ప్రజలు, విద్యుత్ ట్రేడ్ యూనియన్లు నుంచి తీవ్ర ప్రతిఘటన రావడంతో దొడ్డి దారిన సంస్కరణలు అమలు చేసేందుకు స్మార్ట్ మీటర్లను ప్రవేశ పెడుతోంది. స్మార్ట్ మీటర్లు ప్రవేశపెడితే విద్యుత్ రంగంలో మీటర్ రీడింగ్ బిల్లింగ్ చేసే ఉద్యోగులు ఉండరు. స్మార్ట్ మీటర్ల ద్వారా కార్పొరేట్లకు మేలు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది.

పి.అప్పలనర్స, సిపిఎం జిల్లా కార్యదర్శి

సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, అధికారులు

అభివృద్ధి పనులు వేగవంతం

సమీక్షా సమావేశంలో ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే ఇంజనీర్లను ఆదేశించారు. స్థానిక ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఛాంబర్‌లో గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖల ఇంజనీర్లతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో పనుల పురోగతిపై ప్రాజెక్ట్ అధికారి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న భవనాలకు ఒక్కొక్క దానికి ఇంకెంత ఖర్చు అవుతున్నదీ ఆరా తీశారు. ఏడు మండలాలకు సంబంధించిన భవనాల నిర్మాణానికి మెటీరియల్ ఎక్కడినుంచి తీసుకొస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. కాంట్రాక్టర్లతో ఎప్పటికప్పుడు చర్చించి పనులు పూర్తి చేసి, ఎం-బుక్‌లో నమోదు చేసి బిల్లులు అప్లోడ్ చేయాలని సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు పనుల పురోగతిపైనా ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, సత్యనారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గౌతమి, చైతన్య, శ్రీనివాసరావు, అస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, నాగరాజు, భాను, పి.వెంకటరమణ, మహేశ్వరరావు, ప్రసాద్, వంశీ, వీరభద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో బాలింత మృతి

-మృతదేహాన్ని డోలీలో స్వగ్రామానికి తరలింపు

ప్రజాశక్తి - ముంచింగి పుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధిలో ఉబ్బెంగుల గ్రామానికి చెందిన బాలింత వంతల బాసంతి విశాఖ కేజీహెచ్‌లో బుధవారం రాత్రి మృతి చెందినట్లు లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్ల సౌకర్యం లేక పోవడంతో సకాలంలో ఆసుపత్రులకు గర్భిణీలను తీసుకుని వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. డోలీలే ఆదారంగా మారాయన్నారు. ఉబ్బెంగుల గ్రామ సమీపంలోని గెడ్డలో వంతెన నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. బిర్రిగుడ జంక్షన్ నుండి ఉబ్బెంగుల వయా దొరగుడ వరకు తారు రోడ్లు నిర్మాణాలు చేపట్టాలన్నారు. రహదారులు, బ్రిడ్జిలు లేక గిరిజన ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందలేదన్నారు. అనారోగ్య కారణాలతో అత్యవసర వైద్య సేవలకు గర్భిణీ, బాలింతలను తరలించే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. బుధవారం కేజీహెచ్‌లో బాలింత మరణిచడంతో మృతదేహాన్ని గురువారం అంబులెన్స్‌లో స్థానిక సిహెచ్‌సి వరకు తీసుకొచ్చారన్నారు. ఇక్కడి నుంచి బిర్రిగుడ గెడ్డకు అంబులెన్సులో తరలించారని, ఇక్కడి నుంచి ఉబ్బెంగుల గ్రామానికి డోలీలో గెడ్డను దాటుకుంటూ తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. . డోలీ సహాయంతో కాలినడకన ప్రమాదకరమైన గెడ్డను గ్రామస్థుల సహాయంతో గ్రామానికి తరలించారన్నారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి రోడ్డు, వంతెన మంజూరు చేసి నిర్మాణం చేయాలన్నారు.

డోలీలో తరలిస్తున్న కుటుంబీకులు

బాధితునికి పరామర్శ

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గత్తుం పంచాయతీ జిలుగులు పుట్టు గ్రామనికి చెందిన మజ్జి శోభన్న ట్రైడా వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని జడ్పీటీసీ రేగం మత్స్య లింగం. గురువారం పరామర్శించారు. అదర్య పడవద్దని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

నామినేషన్ల దాఖలు

ప్రజాశక్తి-పెదబయలు: ఉప ఎన్నికలకు గురువారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ ప్రక్రియ ముగిసింది. పెడికోడపల్లి పంచాయతీ సర్పంచ్ పదవికి గాను 7, ఇంజారి పంచాయతీలో వార్డు సభ్యులకు నామినేషన్స్ దాఖలయ్యాయి. ఇంజారి పంచాయతీలో 5 వార్డు సభ్యులకు ఐదుగురే నామినేషన్ వేశారు. పెదకోడాపల్లిలో సర్పంచ్ సెగ్గె వెంకటరమణ మృతి చెందటంతో పదవి ఖాళీ అయ్యింది. వెంకటరమణ సతీమణి మాజీ ఎంపీటీసీ నామినేషన్ దాఖాలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సమక్షంలో నామినేషన్ అందిస్తున్న టిడిపి మద్దతుదారులు

సర్పంచ్ ఉప ఎన్నికకు 8 నామినేషన్లు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ సర్పంచి స్థానానికి ఉప ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో గురువారం నామినేషన్లు స్వీకరణ చివరి రోజు ఎనిమిది నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.పాపారావు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి సమక్షంలో టీడీపీ మద్దతుతో జలందర్, సురేష్ నామినేసన్లు వేశారు. ఎంపీపీ బోయిన కుమారి, వైసీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ సమక్షంలో వైసీపీ మద్దతుతో పాంగి దుర్గో నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ మద్దతుతో మాజీ సర్పంచి పరదేశి సతీమణి హిరామణి, బీజేపీ జనసేన మద్దతుతో మరో ఇద్దరు నామినేషన్లు దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి జె.పాపారావు తెలిపారు.

లోదొడ్డి 6వ వార్డుకు ఆరు నామినేషన్లు

రాజవొమ్మంగి : మండలంలోని లోదొడ్డి పంచాయతీ పరిధి ఆరవ వార్డు మెంబర్ ఉప ఎన్నికలకు ఆరు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె తాతబ్బాయి దొర గురువారం తెలిపారు. ఆరో వార్డు సభ్యులు వెంకటరమణ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న బాలదేవ్

పివిటిజిల సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: పాడేరు ఐటీడీఏ పరిధిలో పివిటీజీల సమస్యలపై పోరాటం చేస్తామని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ తెలిపారు. గురువారం అరకువేలి ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.రామన్న అధ్యక్షతన అరకువేలి, డుంబ్రిగుడ, అనంతగిరి పివిటీజీలతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ, పాడేరు ఐటీడీఏ పరిధిలో కోదు, పరెంగిపొర్జ, గదభ, పొర్జ తెగల పివిటిజీలు సుమారు 244 పంచాయతీల్లో 1664 గ్రామాల్లో సుమారు లక్ష 75 వేల మంది ఉన్నారని అన్నారు. 2019లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పివిటిజీలకు అంత్యోదయ కార్డులు రద్దు చేయడం దుర్మార్గమన్నారు. అర్హులైన పివిటిజీలకు అంత్యోదయ కార్డులు తక్షణమే మంజూరు చేయలని డిమాండ్ చేశారు.పివిటిజీలకు సిసిడిపి నిధుల ద్వారా వ్యక్తిగత సబ్సిడీ రుణాలు, సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యాలు, కమ్యూనిటీ హాలు, అంగన్వాడీ కేంద్రాలకు ఖర్చు చేయకుండా జగన్ ప్రభుత్వం దారి మళ్ళిస్తుందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వ్యవసాయ పరికరాలు, వాణిజ్య పంటల యంత్రాలు, మిరియాల నిచ్చెన్నలు పూర్తిగా సబ్సిడీతో పంపిణి చేయలేదన్నారు.పివిటిజిలకు కేంద్ర ప్రభుత్వం 2023-25 సంవత్సరాలకు 15వేల కోట్లు ప్రకటించిందని పాడేరు ఐటీడీఏ పరిధిలో ఎంత కేటాయించారో నేటికీ సమగ్ర సమాచారం లేదని ఆయన అన్నారు.కేటాయించిన నిధులు పివిటిజిలకే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. పివిటిజిల సమస్యలు పరిష్కారం చేయకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎస్.అప్పలరాజు, అప్పన్న, నగేష్, రాజు, సత్యారావు, మాతృభాష విద్య వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు కుమారి, బుజ్జిబాబు ఎస్.అప్పన్న, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని యుటిఎఫ్ నాయకులు ఎం.ఉదయ్ మనోహర్ ఆధ్వర్యంలో గురువారం రాజవొమ్మంగిలో ఘనంగా నిర్వహించారు. తొలిత స్థానిక ఎంపీపీ పాఠశాలలో యుటిఎఫ్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు డి.పైడిమల్లు, పి.వెంకటరమణ మాట్లాడుతూ అలనాటి యుటిఎఫ్ నాయకులు చెన్నపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి తదితరులు అందించిన సేవలు మరువలేనివన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. యుటిఎఫ్ పోరాట ఫలితంగా అనేక సమస్యలు పరిష్కరించుకోగలిగామని తెలిపారు. మరిన్ని సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు గోపాలకృష్ణ, ఎం రమేష్ బాబు, బి సుబ్బారావు, ప్రసన్న, వెంకటలక్ష్మి, సత్యవతి, బొజ్జయ్య, రాంబాబు, కొండబాబు, శ్రీను, జి సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : మండల కేంద్రంలోని ఎలిమెంటరీ పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బాలకృష్ణ ఆధ్వర్యంలో యుటిఎఫ్ జెండాను అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం యుటిఎఫ్ రాజీలేని పోరాటం సాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కౌన్సిలర్లు ఎస్ కన్నయ్య, మండల కార్యదర్శి మోహన్, నాయకులు దుక్కు, శ్రావణ్ కుమార్, మేఘనాథ్, సుజాత పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలోని టోకురు పంచాయతీ పరిధి ములియగుడ పాఠశాల ఆవరణంలో యుటిఎఫ్ జెండాను ఆ సంఘం జిల్లా కార్యదర్శి, మండల అధ్యక్షులు పుడిగి .దేవుడు ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు జీవో 3కు చట్టబద్ధత కల్పించాలన్నారు. నూతన విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు శెట్టి. రాంబాబు, మండల కార్యవర్గ సభ్యులు వివి. ఈశ్వరరావు, నరజి. మల్లేష్, కమిడి. సూర్యప్రకాశ్, సింహాచలం, గంగరాజు,.రామచందర్, విజయ్ కుమార్, గంగులు, సుధారాణి, సునీత పాల్గొన్నారు

రాజవొమ్మంగి, డుంబ్రిగుడ పాఠశాలల్లో యుటిఎఫ్ జెండాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు, ఉపాధ్యాయులు

సహాయం అందజేస్తున్న రామవరం సర్పంచ్ బుచ్చమ్మ, కార్యదర్శి తాతారావు

వరద బాధితుల సేవలో సర్పంచ్, కార్యదర్శి

ప్రజాశక్తి-విఆర్.పురం

శబరి, గోదావరి వరదల వల్ల పలు ఇబ్బందుల పడ్డ బాధితులకు సేవలు అందించడానికి మండలంలోని రామవరం పంచాయతీ సర్పంచ్ కారం బుచ్చమ్మ, కార్యదర్శి తాతారావు విశేష కృషి చేశారు. వారు అందించిన సేవలతో స్థానికుల చేత శభాష్ అనిపించుకున్నారు. సర్పంచ్ బుచ్చమ్మ, కార్యదర్శి తాతారావు వరదల సమయంలో రాత్రి, పగలు అనే తేడాలేకుండా ప్రజాసేవలో నిమగ్నమయ్యారు. నిర్వాసితులకు అండగా నిలిచారు. సాహసోపేతమైన కార్యక్రమాలు చేశారు. మరపడవలపై వెళ్లి వరద బాధితులను పరామర్శించారు. వారి సమస్యలను తెలుసుకొని మంచినీళ్లు, అన్నం, టిఫిన్స్, అందించారు. నడవ లేని స్థితిలో ఉన్న ముసలి వారిని ఒడ్డుకు చేర్చి పునరావాస కేంద్రాలకు తరలించారు. గుట్టలపై గుడారాలు వేసుకొని 15 రోజుల పాటు ఉన్నవారికి అధికారుల నుండి ఎటువంటి సహాయం అందకపోగా, సర్పంచ్, కార్యదర్శి వారి పరిధిలో చేయగలిన సహాయం చేశారు. వరదలు తగ్గుముఖం పట్టిన తరువాత ప్రత్యేక చొరవ తీసుకొని వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించారు. సర్పంచ్, కార్యదర్శికి సిపిఎం నాయకులు వడ్లది రమేష్, పార్టీ బృందం తోడు కావడంతో బాధితులకు మెరుగైన సేవలు అందించగలిగారు.

పక్కాగా సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి- పెదబయలు : కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బందితో ఎంపీడీఓ పూర్ణయ్య, తహసీల్దార్ కృష్ణారావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పూర్ణయ్య మాట్లాడుతూ, ప్రధానమంత్రి ఆది ఆదర్శ గ్రామీణ యోజన పథకం కింద మండలంలో 12 గ్రామాలను ఎంపిక చేయాడం జరిగిందన్నారు. సచివాలయం సిబ్బంది సర్వే నిర్వహించి మౌలిక సదుపాయాలను గుర్తించాలన్నారు. అంగన్వాడీ భవన మరమ్మతులు, మురుగు కాలువలు, సిసి రోడ్లు, విద్యుత్ సదుపాయాలు ప్రతి గ్రామానికి కల్పించేందుకు ప్రత్తిపాదనలు తయారు చేయాలని ఎంపీడీఓ తెలిపారు. ఈనెల 11 నుండి 20 వరకు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సర్వే నిర్వహించి గ్రామ సభల ద్వారా ప్రతిపదించి తీర్మానం చేసి సమర్పించాలని ఆదేశించారు.ప్రధానమంత్రి పివిటిజి మిస్సన్ కింద మండలంలో 161 అదిమజాతి గిరిజన గ్రామాలలో జీవన స్థితిగతులు నమోదు చేయాలని ఆదేశించారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ

చోరీ సొత్తు స్వాధీనం

నాలుగు రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి-రంపచోడవరం

అపహరణకు గురైన సుమారు రూ.10లక్షల విలువైన 209 గ్రాముల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును నాలుగురోజుల్లో పోలీసులు ఛేదించి నిందితున్ని అరెస్ట్ చేశారు. రంపచోడవరం ఏఎస్‌పి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఏఎస్‌పి జగదీష్ ఆడహళ్లి కేసు వివరాలను వెల్లడించారు. ఎఎస్‌పి కథనం ప్రకారం... ఈ నెల 3న దేవిపట్నం మండలం ఇందుకురుపేట గ్రామంలో మెడపాటి సత్యనారాయణ తమ ఇంట్లో బంగారం అపహరణకు గురైనదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా అదే గ్రామానికి చెందిన సాయి కిరణ్ అనే వ్యక్తి సత్యనారాయణ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి వెనుక తలుపు పగలగొట్టి బిరువాలోని బంగారం అపహరించాడని తేలింది. దీంతో పోలీసులు నిండుతుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి బంగారాన్ని రికవరీ చేశారు. ఈ కేసును ఇంత త్వరగా ఛేదించిన రంపచోడవరం సిఐ సురేష్ బాబు, దేవిపట్నం ఎస్సై కెవి.నాగార్జునను సిబ్బందిని ఎఎస్‌పి అభినందించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సిఐ సురేష్ బాబు, దేవిపట్నం ఎస్‌ఐ కెవి.నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్

ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణకు పోరాటం

ప్రజాశక్తి -సీలేరు

ఆదివాసీల హక్కులు, చట్టాలు పరిరక్షణకు గిరిజనులంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి ఆదివాసీ జెఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలైనా నేటికీ గ్రామాలకు రోడ్లు లేక డోలిమోతలు తప్పడం లేదని పేర్కొన్నారు. ఆదివాసీలకు ఉద్యోగాల్లో 100 శాతం రిజర్వేషన్లు కల్పించే జిఒ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన మారణహోమంలో మరణించిన వారి లెక్కలు తేల్చలేని, వారికి మౌనం కూడా పాటించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. మణిపూర్‌లో మహిళపై దాడులు, ఆత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే ఆదివాసీ మహిళ ప్రజాప్రతినిధులైన పాడేరు, రంపచోడవరం, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు, ఎంపీ మాధవి, విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జెఏసి మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సిద్ధార్థ్ మార్క్, కో-కన్వీనర్ కొర్ర నీలకంఠం పాల్గొన్నారు.

నూతన అటవీ సంరక్షణ చట్టంతో మన్యంలో ఖనిజ సంపద దోపిడీ

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

మాట్లాడుతున్న సురేంద్ర

ప్రజాశక్తి - పెదబయలు: మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయం వద్ద ఆదివాసుల హక్కుల దినం ముగింపు సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో జెండాను రాష్ట్ర కమిటీ సభ్యులు టి.కొసల్య ఆవిష్కరించారు.గురువారం మధ్యాహ్నం నిర్వహించిన ఆదివాసీ గిరిజన సంఘం మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులను చిన్నచూపుచూస్తున్నాయని, ఇందులో భాగంగా బిజెపి ప్రభుత్వం నూతన అటవీ సంరక్షణ చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ చట్టం అమలైతే ఇక నుంచి గ్రామసభ ఆమోదం లేకుండానే అటవీ ప్రాంతంలో అటవీ సంపద, మైనింగ్‌ను తరలించుకు పోతారన్నారు.

గిరిజన భూములు కార్పొరేట్ శక్తులకు అప్పు జెప్పడానికి చట్టంలో మార్పులు తెచ్చారన్నారు. ఈ చట్టంతో గిరిజన ప్రాంతము అంతమయ్యే ప్రమాదముందని తెలిపారు. నూతన అటవీ సంరక్షణ చట్టంపై పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు.జిఓ 3కు చట్టబద్ధత కల్పించాలని, బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చరాదని పేర్కొన్నారు.గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ గిరిజనులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

మండల కమిటీ ఎన్నిక

ఈ సమావేశంలో నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పాడల్, పూర్వపు అధ్యక్షులు బొండా సన్నిబాబు, జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడల్ పాల్గొని నూతన మండల కమిటీని ప్రకటించారు. అధ్యక్షులు గా బొండా గంగాధరం, కార్యదర్శిగా కిల్లో శరబన్న, కోశాధికారిగా కె నీలకంఠం, సహాయ కార్యదర్శిగా జె సునీల్ కుమార్, కె వీరయ్య, సభ్యులుగా పి వెంకట్, రామారావులను ఎన్నుకున్నారు.

వారాహి యాత్ర వస్తుంటే వణుకెందుకు?

ప్రజాశక్తి - సీతమ్మధార: పవన్ కల్యాణ్ వారాహియాత్రతో వైసిపి నేతల్లో వణుకు పుట్టుకుందని, అందుకే పోలీసు సెక్షన్ 30ని అడ్డుకోవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పన్నాగం పన్నారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. గురువారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి దోపిడీలు, భూకబ్జాలు, పాలనా వైఫల్యాలను బయట పెడతారనే భయంతోనే పవన్ కల్యాణ్‌ను అడ్డుకునేందుకు వైసిపి నేతలు అన్ని అడ్డదారుల్లో ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విస్సన్నపేటలో భూకబ్జాలను బట్టబయలు చేసిన అనకాపల్లి నూకాలమ్మ సన్నిధిలో మంత్రి అమర్ ప్రమాణం చేయగలరాయని ప్రశ్నించారు. రియల్ భూమాయలో కొండలను బోడిగుండలను చేసి, విశాఖ ఎంపి ఎంవివి ప్రభృతి విధ్వంసాలకు పాల్పడుతున్నారన్నారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్ పరిస్థితి ఏంటోచెప్పాలన్నారు. బటన్ నొక్కి ఎంతమందికి ఎప్పుడు వేశారో చెప్పాలన్నారు. జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్లు ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. బాబాయ్ హత్య కేసులో నిందితులను ఎప్పుడు అరెస్ట్ చేస్తారో జగన్ చెప్పగలరా అని ప్రశ్నించారు. సమావేశంలో రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో సర్రాయి పాఠశాల భవనం

- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు
- పరాయి పంచన తరగతుల నిర్వహణ

శిథిలావస్థలో ఉన్న సర్రాయి పాఠశాల భవనం ఇదే

అసంపూర్తి ఇంట్లో తరగతుల నిర్వహణ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని సర్రాయి ఎంపిపి ఎలిమెంటరీ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉండడంతో విద్యార్థులు బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. దీంతో, విద్యార్థులకు ఆ పాఠశాల సమీపంలోని నూతనంగా నిర్మిస్తున్న నివాస గృహంలో పరాయి పంచన తరగతులను ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఎప్పుడు ఏ సమయంలో కూలి పోతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ పాఠశాల నిర్మించి సుమారు 40ఏళ్లు అవుతుందని అప్పటినుంచి ఎటువంటి మరమ్మత్తు పనులు చేపట్టక పోవడంతో నిర్మించిన భవనం పూర్తిగా శిథిలావస్థలో చేరిందని ఆ గ్రామస్తులు అంటున్నారు. వర్షాలు కురిసినప్పుడు పాఠశాలకు సెలవు ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వం అనేక పాఠశాలల ఆధునికరణ పనులు చేపడుతుంది. పూర్తిగా శిథిలావస్థలో ఉన్న ఈ పాఠశాల భవనాన్ని మరమ్మత్తు పనులు చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం

కలెక్టర్ సుమిత్ కుమార్

విద్యార్థులకు మాత్రలు వేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: నులి పురుగుల నివారణతోనే ఆరోగ్యం మెరుగు పడుతుందని, విద్యా వికాసం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక లోచలిపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కడుపులో ఉండే నులి పురుగులు మనం తినే ఆహారాన్ని ఒంటికి పట్టనివ్వకుండా చేస్తాయని, దీంతో అనారోగ్య పాలవుతామని కాబట్టి పౌష్టిక లోపం చెందడం జరుగుతుందని తెలిపారు. మనకు కావలసిన విటమిన్లు, పిండి పదార్థాలు, లభించకుండా పోతాయని విశ్లేషించారు. ఈ కారణంతో అనారోగ్యం పాలవటం, మెదడు చురుకుదనం కోల్పోయి తెలివితేటలపై ప్రభావం చూపుతుందని వివరించారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది విద్యార్థులకు మాత్రలు వేసి అందరికీ అవగాహన కల్పించారు. జిల్లా వైద్య ఆరోగ్యాధికారి జమాల్ బాషా మాట్లాడుతూ, ఒకటి నుండి రెండు సంవత్సరాల పిల్లలు ఆల్బెండజోల్ మాత్ర ఒక ముక్క, రెండు సంవత్సరాలు దాటిన వారు పూర్తి మాత్ర వేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 6,475 ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడి కేంద్రాలలో 3,35,065 మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు. ఇందులో 3,508 మంది బడి బయట పిల్లలు, అంగన్వాడి కేంద్రాలలో నమోదు కాని 2,035 మంది పిల్లలను గుర్తించి వారికి కూడా ఆల్బెండజోల్ పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ప్రధానోపాధ్యాయులు జివిబి ప్రసాద్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం టి.రంగారావు, వసతి గృహ సంక్షేమాధికారి పి. చిట్టిబాబు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం డివిజన్ కే అప్పలరాము విద్యార్థులకు అవగాహన కల్పించారు. కడుపులో నులి పురుగులు ఉండటంతో ఆకలి వేయదన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కే.పార్వతి, ఎన్ఎస్ఎస్ పిఒ జె అప్పలనాయుడు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ ఆధ్వర్యంలో ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో గురువారం ర్యాగింగ్ నిరోధక చట్టం-1997పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్ పాల్పడిన విద్యార్థులకు జైలుశిక్ష, జరిమానా తప్పదని, ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో రెండవ అదనపు చీఫ్ మెజిస్ట్రేట్ ఓవిఎల్.హిమబిందు, ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, ప్రభుత్వ మానసిక వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ప్రభాత్, విశ్రాంత ప్రొఫెసర్ ఎ.పద్మావతి, న్యాయవాదులు కప్పిలి మురళీధర్, లక్ష్మీరాంబాబు, ధరణి స్వచ్ఛందసంస్థ సెక్రటరీ బి.హరివెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'నా మట్టి - నా దేశం'

మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన స్వాతంత్ర పోరాట సమరయోధులను స్మరించు కునేందుకు నా భూమి నా దేశం కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయడం సంతోషకరమని ఎమ్మెల్యే ఫాల్గుణ తెలిపారు.. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నా భూమి నా దేశం కార్యక్రమంలో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, మొక్కలను ఎమ్మెల్యే నాటారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. నాటిన మొక్కలను ప్రతి ఒక్కరు సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ ఈశ్వరి, జెడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ స్థానిక సర్పంచ్ వెంకటరావు, వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు శెట్టి గోపాల్, మాజీ జడ్పిటిసి ఎం శ్రీరాములు, ఎంపీటీసీ ఎం.గీతా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాకా సింహాచలం, సిహెచ్ కృష్ణారావు, ఏపీఓ దొరబాబు, మండల విద్యాశాఖ అధికారి సుందరరావు, ఏవో నిలవేణి,అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ:-మండలంలోని కొర్రాయి పంచాయతీ సచివాలయంలో గురువారం నా భూమి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని సర్పంచ్ పి.కొములు ఆవిష్కరించి, సచివాలయ కార్యాలయ ఆవరణలో వివిధ మొక్కలను నాటారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ దేశం కోసం పోరాడి ప్రాణత్యాగలు చేసిన స్వతంత్ర పోరాట సమరయోధులను ప్రతి ఒక్కరూ ప్రతి ఏడాది స్మరించుకోవాలని చెప్పారు. వారి యొక్క ప్రాణత్యాగ ఫలితంగా నేడు దేశానికి స్వాతంత్రం రావడంతో అందరూ స్వేచ్ఛగా బ్రతుకుతున్నామని చెప్పారు. నాటిన మొక్కలను పెరిగే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లలిత, ఉపాధి హామీ పథకం విఆర్ పి ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి ప్రత్యూష, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు ,వార్డు సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గీతం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ...

మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఆచార్యులు

మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, ఎన్ఎస్ఎస్ ఆధ్యర్యంలో చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నా భూమి, నా దేశం నినాదంతో వనసంరక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్.గోపినాథ్,, గీతం బయోటెక్నాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్.కె.ఖాశీబేబి, డాక్టర్ పద్మావతి, హెచ్ఎం ఎమ్.రాజాబాబు, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్‌వాలంటీర్లు మొక్కలను నాటారు.కార్యక్రమ ప్రాధాన్యతను ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసి అమరులైన జవాన్లను స్మరించుకున్నారు.

మాట్లాడుతున్న సుదర్శన్ రెడ్డి, చిత్రంలో బాలకాశి

'విద్యుత్ చీకటి ఒప్పందం' దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల ఆశలపై నీళ్లు జల్లుతూ యాజమాన్యంతో పవర్ జెఎసి చేసుకున్న చీకటి ఒప్పందాన్ని ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు కమిటీ చైర్మన్ పి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక వర్గానికి ఏ మాత్రమూ ఆమోదయోగ్యం కాని ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని, దళారీ వ్యవస్థను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. విద్యుత్ ఉద్యోగులకు మెరుగైన పిఆర్‌సి ఇస్తామని చెప్పారన్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టకపోగా బుధవారం ప్రభుత్వంతో జరిగిన ఒప్పందంలో కేవలం 8 శాతం ఫిట్‌మెంట్ యాక్ట్ 2018 పిఆర్‌సి ప్రకారం బేసిక్ పే పైన కేవలం 2 శాతం పెంచుతామని చెప్పటం దుర్మార్గమన్నారు. ఈ ఒప్పందానికి పవర్ జెఎసి ఆమోదం తెలపడం మొత్తం ఉద్యోగ కార్మిక వర్గాన్ని వంచించడమేన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ చీకటి ఒప్పందాన్ని సమీక్షించి కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీస్ రేటు కార్మికులకు సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులకు మెరుగైన పిఆర్‌సి ప్రకటించాలని, ఇపిఎఫ్ నుంచి జిపిఎఫ్‌గా మార్చాలని, విద్యుత్ ఉద్యోగులు, జెఎల్ఎం గ్రేడ్ - 2లను సచివాలయ ఉద్యోగులుగా కాకుండా విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పవర్ జెఎసితో ప్రభుత్వం, యాజమాన్యం చేసిన ఒప్పందాన్ని నిరసిస్తూ ఈ నెల 17న చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని వేలాది మందితో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు ఎం.బాలకాశి, కె.నాగరాజు, వేపాడ సత్యనారాయణ, ఎస్.శ్రీనివాస శేఖర్‌తో పాటు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పడాల రమణ పాల్గొన్నారు.

'చలో అడ్మిన్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఉక్కునగరం : కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 11న చలో అడ్మిన్ కార్యక్రమం చేపట్టినట్లు ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. దీనికి సంబంధించి పోస్టర్‌ను ఎల్ఎంఎంఎం పార్కులో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల హక్కులపై దాడికి పూనుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు. జి శ్రీనివాసరావు, నమ్మి రమణ, ఉమ్మడి అప్పారావు, సంజీవరెడ్డి, కోన రమణ, వంశీ పాల్గొన్నారు.

రైల్వే భద్రతపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు రైల్వే డివిజన్ ప్రయాణికుల భద్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ మోహిన్త్ బ్రహ్మ నేతృత్వంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సున్నా ప్రమాదాల స్థితిని సాధించే దిశగా అధికారులు కృషి చేస్తున్నారు.

నేటి నుంచి మలబార్-2023

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇండియన్ నేవీ, యుఎస్ నావికాదళాల మధ్య ద్వైపాక్షిక విన్యాసాలు మలబార్ - 2023 పేరిట శుక్రవారం నుంచి జరుగనున్నాయి. ఈ క్రమంలో భారత నావికా దళం నుంచి యుద్ధనౌకలు ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ కొల్‌కతాతో పాటు యుఎస్ నేవీ, జపాన్ మారిటైమ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్, రాయల్ ఆస్ట్రేలియన్ నేవీ నౌకలు, విమానాలు విన్యాసాలకు సిద్ధమయ్యాయి.

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనుకునే

బిజెపిపై పవన్ ఉదాసీనత

- రాష్ట్రంపై ప్రధానికి ఫిర్యాదు చేస్తానంటూ పదేపదే చెప్పిన వైనం
- ఎయుపై తీవ్ర విమర్శలు
- సంక్షేమ పథకాలపైనా వ్యంగ్యాస్త్రాలు
- విశాఖలో ఇల్లు తీసుకుంటానన్న జనసేనాని
- ప్రసంగం ప్రారంభంలోనే జారుకున్న జనం

సభకు హాజరైన వారికి అభివాదం చేస్తున్న పవన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

జనసేన అధినేత పవన్ కల్యాణ్ విశాఖలో గురువారం ఆరంభించిన వారాహి విజయ యాత్రలో బిజెపిని పల్లెత్తు మాట అనలేదు. రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమ్మకానికి పెట్టినా ఉదాసీనతే ప్రదర్శించారు. జగదాంబ జంక్షన్ వద్ద బహిరంగ సభలో పవన్ ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలపై ప్రధాని మోడీకి ఫిర్యాదు చేస్తానంటూ పదేపదే చెప్పడం కనిపించింది. స్టీల్‌ప్లాంట్‌ను వంద శాతం అమ్మకానికి పెట్టి.. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోని మోడీ పద్ధతిని యావత్ ఉత్తరాంధ్ర, రాష్ట్ర ప్రజలు, కార్మికులు వ్యతిరేకిస్తూ 900 రోజులకుపైగా పోరాడుతున్నా కనీసం తన మద్దతు వారికుందని పవన్ వెల్లడించలేదు. బిజెపిపై పవన్ మాట మాత్రమైనా అనకుండా గంట సేపు తన ప్రసంగాన్ని సాగించారు. సాయంత్రం 7 గంటలకు వారాహి వాహనంపైకి ఎక్కి పవన్ తన ప్రసంగం ప్రారంభించి 8 గంటల వరకూ మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం ఇదే జంక్షన్‌లో తన సుస్వాగతం సినిమా కోసం ఒక వాహనంపై తాను చేసిన డ్యాన్సు గురించి ప్రస్తావించారు. ఇప్పుడు రాజకీయ నాయకుని హోదాలో వచ్చానంటూ తన ప్రసంగం ప్రారంభించారు. పవన్ ప్రసంగం ప్రారంభమైన ఐదు నిమిషాల వ్యవధిలోనే సభా ప్రాంగణంలోని వేలాది మంది వెనుదిరిగారు. జగన్ పాలనపై పవన్ సెటైర్లు వేశారు. 'పొద్దున్నే పథకం పేర డబ్బులు పడతాయని, సాయంత్రం అయితే సారాతో పోతాయి' అని వ్యాఖ్యానించారు. దీంతో సభికుల నుంచి చప్పట్లు కురిశాయి. తనకు కేంద్రంలోని మోడీ, అమిత్ షా, ఇతర మంత్రులతో సాన్నిహిత్యం వల్ల ఈ రాష్ట్రం గురించి అన్ని విషయాలూ తెలుస్తున్నాయని, జగన్ పాలనపై కేంద్రం చాలా సీరియస్‌గా ఉందని అన్నారు.

వాలంటీర్లపై పాత పాటే పాడిన పవన్

వాలంటీర్ల వ్యవస్థపై గతంలో చేసిన ఆరోపణలనే పవన్ పునరుద్ఘాటించారు. జగన్ సంగతి బిజెపి చూసుకుంటుందని అవసరమైతే తనను కేంద్రానికి పిలుస్తారని పదేపదే చెప్పారు. విశాఖలో భూ కబ్జాలు పెరిగిపోయాయని, వాలంటీర్ల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయని, పంచాయతీల నిధులను వాలంటీర్ల జీతాలకు జగన్ మళ్లించేస్తున్నాడని తెలిపారు. ఉత్తరాంధ్రను కాలుష్య పరిశ్రమలకు నిలయంగా మార్చేశాడని విమర్శించారు. వైసిపి ఎంఎల్‌ఎలంతా రౌడీషీటర్లలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. వీటన్నిటిపైనా ప్రధానికి తాను ఫిర్యాదు చేస్తానన్నారు. ఎయు గంజాయి, మందు బాబులకు నిలయంగా మారిపోయిందంటూ తీవ్ర విమర్శలు చేశారు. విశాఖలో రౌడీషీటర్లు పెరిగిపోయారని, ఒక ఎంపీ కుటుంబాన్ని కిడ్నాప్ చేసేవరకూ విషయం వెళ్లిందంటే శాంతిభద్రతలు ఉన్నాయా ? అన్న సందేహం కలుగుతుందన్నారు. జగన్‌ను వీరప్పన్‌తో పవన్ పోల్చారు. వైజాగ్‌లోనే ఇల్లు తీసుకుంటానని చెప్పారు.

ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పునఃప్రారంభం

రూ.2.4 కోట్లతో బేబీ పూల్ సహా వివిధ పనులు

శిలా ఫలకం వద్ద మేయర్ హరి వెంకట కుమారి, తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బీచ్ రోడ్డులోని జివిఎంసి ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను మేయర్ గొలగాని హరి వెంకట కుమారి డిప్యూటీ మేయర్ కె.సతీష్‌తో కలిసి గురువారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ 1995లో ప్రారంభమైందని, కరోనా కారణంగా రెండేళ్లపాటు మూతపడిందని తెలిపారు. ఈతగాళ్లతో పాటు శిక్షణార్థులను దృష్టిలో పెట్టుకుని ఏడాది కాలంగా పలు మరమ్మతులు చేపట్టామని వెల్లడించారు. గతానికి భిన్నంగా 15 మంది బాలలకు ఉపయోగపడేలా బేబీ పూల్‌ను కూడా సిద్ధం చేశామన్నారు. యంత్రాలు, నీటి సరఫరా, ఎలివేషన్, టైల్స్, మరుగుదొడ్లు, ఆకర్షణీయమైన ముఖద్వారం ఏర్పాటుకు సుమారు రూ.2.4 కోట్లు ఖర్చయిందని, నగర వాసులు ఈ పూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చల్లా రజని, పెద్దింటి ఉషశ్రీ, జివిఎంసి చీఫ్ ఇంజినీర్ రవికృష్ణంరాజు, నీటి సరఫరా విభాగం ఎస్ఇ వేణుగోపాల్, మెకానికల్ విభాగం ఎస్ఇ కృష్ణారావు, గాజువాక ప్రాంత ఎస్ఇ గోవిందరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్, జెడ్‌సిలు విజయలక్ష్మి, శివకుమార్ పాల్గొన్నారు.

పంటను చూపుతూ నష్టపరిహారం అర్థిస్తున్న వెంకన్నబాబు

నష్టపరిహారం చెల్లించరూ..

ప్రజాశక్తి - విఆర్.పురం : ఇటీవల భారీ వర్షాలు కారణంగా శబరి గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహించడంతో మూడు ఎకరాల్లో మినుము పంట మునిగిపోయి పూర్తిగా దెబ్బతిందని మండలంలోని విఆర్.పురం గ్రామానికి చెందిన వెంకన్న బాబు తెలిపారు. వెంకన్నబాబు ధర్మతాళ్లగూడెం గ్రామంలోని మూడు ఎకరాల మినుము పంట వేశారు. పంట కాపుకు దగ్గర్లోకి వచ్చిన సమయంలో వరదలు వచ్చి మునిగిపోవడంతో పంట మొత్తం నాశనమైందని వెంకన్నబాబు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రూ.30 వేలు నష్టం జరిగిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతు కోరారు. వ్యవసాయమే జీవనాధారమని, అధికారులు ఇంతవరకు వరదకు మునిగిపోయిన పంటను చూడలేదని, తక్షణమే అధికారులు స్పందించి వరదలకు మునిగిపోయిన పంటను పరిశీలించి నష్టపరిహారం అందించి వెంకన్నబాబు కోరుతున్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి - సీలేరు : విద్యార్థులు ఇన్‌స్టాగ్రామ్, పేస్‌బుక్ వంటి వాటికి దూరంగా ఉండి ఉన్నత చదువులను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీలేరు సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ సూచించారు. వజ్రోత్సవాలు ముగింపు సందర్భంగా జాతీయ పతాకాలు రెపరెపలాడిస్తూ సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఈసీ చేసిన ప్రతి విద్యార్థి ఐటీ మ్యాట్ పూర్తి చేస్తే సంవత్సరానికి దాదాపు 35 లక్షల ప్యాకేజీ పొందవచ్చునని, ఆ దిశగా ఉన్నత చదువులు చదవాలని సూచించారు. గూగుల్లోకి వెళ్లి మనకి ఎటువంటి అవకాశాలు ఉన్నాయో పరిశీలించాలని కోరారు. అనంతరం కాలేజీ ఆవరణలో పలు రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, అధ్యాపకులు, వాలంటీర్లు సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ఎపిలో ప్రజాస్వామ్యం ఉందా ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా ? అని టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ ప్రశ్నించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబుకు జెడ్ ప్లస్ కేటగిరీలో కేంద్ర బలగాలతో రక్షణ ఉన్నప్పటికీ ఆయన ప్రాణానికి హాని తలపెట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా ? అనే ప్రశ్న తలెత్తుతోందని తెలిపారు. హిట్లర్ కన్నా ఎక్కువుగా జగన్మోహన్ రెడ్డి వేధిస్తున్నాడని అన్నారు. జగన్ పర్యటనకు వస్తే ప్రతిపక్ష పార్టీల నాయకులను ఇంటి వద్ద అరెస్టు చేసి భయపెడుతున్నారని, అదే పద్ధతి చంద్రబాబునాయుడు వచ్చినప్పుడు ఎందుకు అవలంబించడం లేదని ప్రశ్నించారు.

రైల్వేలో ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రైల్వేలో నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్ డివిజనల్ కో-ఆర్డినేటర్ టివి.మౌళీశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం డిఆర్ఎమ్ కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎకోర్టీ మీదుగా క్రూ వర్కింగ్ సిస్టం ప్రకారం ఎంజికె చెల్లించాలన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే ఆసుపత్రి పేషెంట్లను యుఎమ్ఐడి కార్డు ఆధారంగా రిఫరల్ ఆసుపత్రులకు తరలించాలన్నారు. పెట్రోలింగ్ బీట్‌ను 22 కిలోమీటర్ల నుంచి 16 కిలోమీటర్లకు తగ్గించాలన్నారు. ఫేస్ రీడర్ బయోమెట్రిక్ అటెండెన్స్ ఆపాలన్నారు.